
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 ; కనిష్ఠం 19.7

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్ జిల్లా వార్తలు

5 గురువారం 25 జనవరి 2024



ఆదర్శ పాఠశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముప్కాల్, జనవరి24: బాల్కొండ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుకోవడానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.శంకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 విద్యసంవత్సరానికి 6, 7, నుంచి పదో తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈడబ్ల్యూఎస్ రూ.125 ఆన్‌లైన్ ద్వారా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



పోస్టింగ్‌ల కోసం పోలీసుల పైరవీలు!

- జిల్లాలో కీలకమైన పోస్టింగ్‌లపై పోలీసు అధికారుల చూపు
- అధికార పార్టీ నేతల ద్వారా సిఫారసులు
- ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు
- తమకు అవకాశం ఇవ్వాలని వేడుకోలు
- ఎన్నికల షెడ్యూల్‌కు ముందే చేపట్టనున్న అధికారుల బదిలీలు

నిజామాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే అధికారుల బదిలీలు ఉండటంతో కొత్త పోస్టింగ్ కోసం పోలీసు అధికారులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో పాటు సీనియర్ నేతలకు పోస్టింగ్‌ల కోసం తిరుగుతున్నారు. సిఫారసు లేఖలను తీసుకుంటూ తమకు నచ్చిన పోలీసు స్టేషన్లు, సర్కిల్, సబ్ డివిజన్‌లకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో పనిచేస్తున్న కొంత మంది అధికారులు ఇతర జిల్లాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా వేరే జిల్లాలో పనిచేస్తున్న అధికారులు జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ముద్ర పడ్డ అధికారులతో పాటు లూప్‌లైన్‌లో పనిచేస్తున్న అధికారులు కూడా ఈ దఫా లోకల్ పోస్టులను పొందేందుకు గట్టి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఉన్న అధికార పార్టీ నేతల ద్వారా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. కొంత మంది ఎంతకైనా సిద్ధమేనని ఒప్పందాలు చేసుకుంటూ బదిలీలకు సిద్ధమవుతున్నారు.

70 శాతం అధికారుల బదిలీలు పూర్తి

పార్లమెంట్ ఎన్నికల ముందు జిల్లాలో పనిచేస్తున్న కొంత మంది అధికారులను బదిలీ చేయనున్నారు. మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న అధికారులతో పాటు ఇతర అధికారులు కూడా కొంత మంది బదిలీ కానున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలోనే జిల్లాలో పనిచేస్తున్న 70 శాతం అధికారులు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లారు. వారు వచ్చే నెలలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రానుండటంతో ఆలోపే మరోదఫా అధికారుల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. ఎన్నికల షెడ్యూల్ వస్తే జూన్ వరకు బదిలీలు ఉండకపోవడం వల్ల ఈ బదిలీల్లోనే తమకు నచ్చిన పోలీసు స్టేషన్లకు వెళ్లేందుకు జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులు ప్రయత్నాలను చేస్తున్నారు. లా అండ్ ఆర్డర్‌లో పనిచేసే అధికారులతో పాటు లూప్‌లైన్‌లో ముఖ్యంగా సీఐడీ, ట్రాఫిక్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇంటెలిజెన్స్‌తో పాటు ఇతర శాఖల్లో పనిచేస్తున్న వారు పోలీసు స్టేషన్‌కు వచ్చేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. ఎస్సై నుంచి ఏసీపీ వరకు ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో జిల్లాలో పనిచేసిన 70 శాతానికి పైగా అధికారులు బాసర, మల్టీజోన్ పరిధిలో బదిలీ అయ్యారు. కొంత మంది అధికారులు లూప్‌లైన్‌లో పోస్టింగ్‌లు పొందారు. మూడేళ్లు జిల్లాలో పూర్తి చేసుకున్న అధికారులందరిని బదిలీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఈ బదిలీలు జరిగాయి. ప్రస్తుతం పార్లమెంట్ షెడ్యూల్‌కు ముందు మూడేళ్లు పూర్తిచేసుకున్న అధికారులను బదిలీ చేయాలని ఆదేశాలను ఇచ్చారు.

పైరవీల జోరు

కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచేసే అధికారులకు కీలకపోస్టులు వస్తాయని భావించినా.. ప్రస్తుతం పైరవీల జోరు మాత్రం కొనసాగుతోంది. జిల్లాలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల చుట్టూ కొంత మంది అధికారులు తిరుగుతున్నారు. తమకు అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నారు. నచ్చిన పోలీసు స్టేషన్ పోస్టింగ్ కోసం సిఫారసు చేయించుకుంటున్నారు. వీరే కాకుండా అధికార పార్టీకి చెందిన సీనియర్ నేతల ద్వారా ప్రయత్నాలను చేస్తున్నారు. పోస్టింగ్ ఇస్తే అనుకూలంగా ఉండటంతో పాటు వారికి కావాల్సిన పనులు చేసి పెడతామని హామీలు ఇస్తున్నారు. బదిలీల్లో భాగంగా తెచ్చుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ముద్ర పడ్డ కొంత మంది అధికారులు కూడా అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. వారికి గత ప్రభుత్వ హయాంలో ఎలా సహకరించారో వివరిస్తూనే కొత్త పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో పనిచేస్తున్న వారితో పాటు గతంలో పనిచేసి ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులు కూడా జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. వారు పనిచేస్తున్న జిల్లా నుంచి వచ్చి ఇక్కడి నేతలను కలిసి వెళ్తున్నారు. కొంత మంది ఇతర జిల్లాల నేతల ద్వారా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ నేతలు కూడా తమకు అనుకూలమైన వారిని తెచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులతో పాటు ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసిన నేతలు కూడా తమకు నచ్చిన టీమ్‌ను తెచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కూడా పనిచేసే అధికారులకు అవకాశం ఇవ్వాలని కోరారు. తమ నియోజకవర్గాల్లో అనుకూలమైన వారిని నియమించాలని మంత్రికి విన్నవించారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే బదిలీలు కానుండటంతో పోలీసు అధికారులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో రెండు సబ్ డివిజన్‌లలో పనిచేస్తున్న ఏసీపీలను కూడా బదిలీ చేయనుండటంతో గతంలో జిల్లాలో పనిచేసి ప్రస్తుతం డీఎస్పీలుగా పదోన్నతులు పొందిన వారు ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పదేళ్ల క్రితం ఉన్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారులు కూడా తమవంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ముందు జరిగే ఈ బదిలీల్లో ఎంత మంది జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్తారో, ఎంత మందికి కోరుకున్న పోస్టింగ్‌లు దొరుకుతాయో, ఎంతవరకు పైరవీలకు అవకాశం వస్తుందో తేలే అవకాశం ఉంది.

నగర పరిధిపై పలువురి ఆసక్తి

ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా జరిగే బదిలీలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు కొంత మంది అధికారులు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు నగరం పరిధిలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నగరం పరిధిలో ఉన్న ఆరు పోలీసు స్టేషన్‌లతో పాటు రూరల్ పోలీసు స్టేషన్‌లపై నజర్ పెట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కొంత మంది అధికారులు ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీల పరిధిలో పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మరికొంత మంది అధికారులు జాతీయ రహదారి వెంబడి ఉన్న పోలీసు స్టేషన్‌లకు వెళ్లేందుకు గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. మంజీరా వెంట ఉన్న పోలీసు స్టేషన్‌లకు, సరిహద్దు పోలీసు స్టేషన్‌లకు డిమాండ్ కూడా ఎక్కువగా ఉంది. గుట్కా, మట్కా, ఇసుక, మట్టి దందాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లేందుకు కొంత మంది అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

మాధవనగర్ రైల్వే గేటు మూసివేత



రైల్వే గేటు మూసివేసిన దృశ్యం



డిచ్‌పల్లి, జనవరి 24: మాధవనగర్ రైల్వేగేటు (ఆర్వోబీ) నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నందున పనుల వేగవంతం కోసం గురువారం నుంచి వచ్చే నెల 20 వరకు రైల్వే గేటు పూర్తి స్థాయిలో మూసి వేయనున్నామని సౌత్ సెంట్రల్ రైల్వే హైదరాబాద్ డివిజన్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ శివ రాము బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్, నిజామాబాద్ సీపీ, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లకు సమాచారం అందజేశారు. రైల్వే వంతెన నిర్మాణ పనులు తుది దశకు చేరిన కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు రాకుండా 193 లెవల్ రైల్వే క్రాసింగ్ గేటును మూసివేయాలని నిర్ణయించినట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. రహదారి ట్రాఫిక్‌ను బైపాస్ రోడ్డు ఫౌండేషన్ నిర్మాణం గురువారం నుంచి వచ్చే నెల 20 వరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందని, వాహనచోదకులు ఈ విషయం గమనించి రైల్వే, ఆర్ అండ్‌బీ అధికారులకు సహకరించాలని ఆ య ా ం న కోరారు.



ప్రత్యేక పాలనకు ఏర్పాట్లు

- త్వరలో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- ప్రత్యేక అధికారులను నియమించేందుకు కసరత్తు
- జాబితాను సిద్ధం చేసిన జిల్లా అధికారులు
- జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు

నిజామాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని సర్పంచుల పదవీకాలం ముగుస్తుండటంతో ప్రత్యేక అధికారుల పాలన కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పంచాయతీలకు అధికారులను నియమించేందుకు సిద్ధమవుతున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు ఇప్పటికే జాబితాను సిద్ధం చేశారు. ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వగానే ప్రత్యేక అధికారులను నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని పంచాయతీల డివిజన్‌లను బట్టి ఈ నియామకాలను చేయనున్నారు.

నెలాఖరుతో ముగియనున్న కాలం

జిల్లాలో సర్పంచుల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు వల్ల సర్పంచ్ ఎన్నికలను నిర్వహించడం లేదు. పార్లమెంట్ ఎన్నికల తర్వాతే ఎన్నికలను నిర్వహించనుండటంతో గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యదర్శి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్లతో సమీక్ష రాష్ట్ర కార్యదర్శి నిర్వహించడంతో ఆయన ఆదేశాలకు అనుగుణంగా నియామకాలను చేసేందుకు అధికారులు కసరత్తు చేశారు. జిల్లాలో మొత్తం 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు మధ్య రకం, చిన్న పంచాయతీలు ఉన్నాయి. వీటన్నింటికి వాటి స్థాయిని బట్టి అధికారులను నియమించేందుకు జిల్లా పంచాయతీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలకు గెజిటెడ్ స్థాయి అధికారులను నియమించనున్నారు. మిగతా గ్రామ పంచాయతీలకు మండల స్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులను నియమిస్తారు. జిల్లాలో ఎమర్జెన్సీ విధులు నిర్వహించే వైద్య, ఆరోగ్య శాఖ, విద్యుత్‌తో పాటు విద్యాశాఖకు మినహాయింపులు ఇస్తూ మిగతా శాఖల నుంచి అధికారులను నియమిస్తున్నారు. కొన్ని శాఖలకు చెందిన డివిజన్ అధికారులకు కూడా ప్రత్యేక అధికారులుగా నియామకం చేయనున్నారు. మండల స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు ఇంజనీరింగ్ శాఖల అధికారులకు కూడా ఈ విధులను కేటాయించనున్నారు. ప్రభుత్వం నుంచి ఈనెల 29న గానీ 30న గాని ఆదేశాలు రాగానే ప్రత్యేక అధికారులను నియమించేందుకు అధికారులు జాబితాను సిద్ధం చేశారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించేంతవరకు ఈ ప్రత్యేక అధికారులే బాధ్యతలలో కొనసాగనున్నారు. జిల్లాలో ప్రత్యేక అధికారుల నియామకం కోసం జాబితాను సిద్ధం చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి జయసుధ తెలిపారు. ప్రభుత్వం నుంచి జీవో వెలువడగానే నియామకాలు చేపడతామని తెలిపారు.



● బోధన్‌లో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్ ఇలా..

ట్రాఫిక్ అస్తవ్యస్తం

- ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్
- పాదచారులు, సామాన్యులకు తప్పని ఇక్కట్లు
- కలగా ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు

బోధన్‌రూరల్, జనవరి 24: బోధన్ పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ గాడి తప్పుతోంది. రోడ్లపై ఎటు చూసినా వాహనాల రద్దీతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, బ్యాంకులు, ఇతర మాల్స్‌ల వద్ద నిలిచి ఉన్న వాహనాలతో రద్దీగా మారుతోంది. పట్టణంలోని ప్రధాన రోడ్లపై ఇష్టారాజ్యంగా పార్కింగ్‌లు చేపడుతున్నా.. పోలీసులు కనీస చర్యలు చేపట్టలేకపోతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు పట్టణంలోకి పగటి వేళ భారీ వాహనాలు రాకుండా బైపాస్ మార్గాలు ఉన్నప్పటికీ పట్టణ రోడ్ల గుండానే రాకపోకలు సాగిస్తున్నాయి. పట్టణంలోని కొత్త బస్టాండ్, శర్బత్‌కెనాల్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, పాత బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారాయి. ఈ ప్రాంతాల్లో నడిరోడ్లపైనే వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. రోడ్లకు ఇరువైపులా షాపుల ఎదుట ఇతర అవసరాల నిమిత్తం రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు కలిగేలా వాహనాల పార్కింగ్‌లు చేపడుతున్నారు.

ట్రాఫిక్ పోలీసుల తొలగింపుతో ఇక్కట్లు

గతంలో బోధన్‌లో ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించేవారు. ఉన్న సిబ్బందిలో కొందరికి ట్రాఫిక్ డ్రెస్సులను వేసి బాధ్యతలను అప్పగించే వారు. కొద్ది నెలల క్రితం వరకు బోధన్‌లో ట్రాఫిక్ ఎస్సైతో పాటు సిబ్బంది పని చేసేవారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, పాతబస్టాండ్, రైల్వేగేటు వద్ద విధులు నిర్వహించేవారు. కానీ ఇటీవల బోధన్‌లో ట్రాఫిక్ పోలీసులను తొలగించారు. దీంతో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటుపై సందేహాలు

పట్టణంలో ట్రాఫిక్ స్టేషన్ ఏర్పాటు అయ్యేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ వ్యవస్థను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఉన్నతాధికారులు మాత్రం ఇందుకు కార్యాచరణ చేపట్టలేకపోతున్నారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్‌ను నియంత్రించే ఆస్కారం ఉంది.

పట్టణంలో పెట్రోలింగ్ పెంచుతాం..

: కిరణ్ కుమార్, ఏసీపీ, బోధన్

పట్టణంలో సాయంత్రం 5నుంచి 7గంటల వరకు పెట్రోలింగ్ పెంచాల్సిన అవసరం ఉంది. పట్టణంలో ఇటీవల కాలంలో ట్రాఫిక్ తీవ్రంగా పెరగడంతో పాటు వాహనాల సంఖ్య సైతం పెరిగి సమస్య ఏర్పడుతోంది. వాహన తనిఖీలు, జరిమానాలతో పాటు రెండు, మూడు గంటల పాటు గస్తీ చేపడితే ట్రాఫిక్ అదుపులోకి వచ్చే అవకాశం ఉంది. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేక ఇబ్బందులు సైతం ఏర్పడుతున్నాయి. త్వరలోనే ట్రాఫిక్ వ్యవస్థను గాడిలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.



● పట్టణంలో వాహనాల పార్కింగ్ ఇలా..

ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలి

● సీహెచ్‌వీ హనుమంతరావు

బోధన్‌రూరల్, జనవరి 24: ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు కలిగిన నేషనల్ ఫ్రంట్ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నేత నందమూరి తారక రామారావుకు అత్యుత్తమ పురస్కారం అయిన భారత రత్న ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి సీహెచ్‌వీ హనుమంతరావు డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలు గు జాతి గుర్తింపు కోసం కృషి చేసిన మహానేతను విస్మరించడం బాధాకర మని అన్నారు. సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపించి అట్టడుగు వర్గాలకు పదవులు, పరపతి గౌరవం ఇచ్చిన ఎన్టీఆర్‌ను గుర్తించకపోవడం కేంద్ర ప్రభుత్వం వివక్షతకు నిదర్శనమని పేర్కొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న జిల్లా పశు వైద్యాధికారి జగన్నాథచారి

కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్నరైతులు పశువుల రుణాలకు అర్హులు: జిల్లా పశు వైద్యాధికారి

నందిపేట, జనవరి 24: కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న ప్రతీ రైతు పశువుల రుణాలు పొందడానికి అర్హులని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ జగన్నాథచారి తెలిపారు. బుధవారం నందిపేట మండలం చింరాజ్‌పల్లి గ్రామంలో మండల పశు వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ జగన్నాథ చారి మాట్లాడుతూ కైసైసీ ఉన్న రైతుకు రూ.1.60వేల పశువుల రుణం ఇ సామని, ఒక్కో గేదెకు రూ.24వేలు చొప్పున మెంటెనెన్స్ కింద రుణం లభిస్తోందని వివరించారు. బ్యాంకులో పంటల రుణం రూ.లక్షా ఉంటే రూ.60వేలు రుణం వస్తుందన్నారు. అర్హులైన రైతులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, రేషన్, పాస్‌కార్డు, ఆదాయం సర్టిఫికెట్, బ్యాంకు పాస్ బుక్కు జిరాక్స్‌లు, రెండు ఫోటోలతో ఆయా మండల పశు వైద్యశాలలో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జగన్నాథచారి కోరారు. జిల్లాలో 3లక్షల 8వేల 150 పశువులు ఉన్నాయని, అందులో లక్షా 2వేల 252 ఆవులు, 2లక్షల 6వేల 898 గేదెలు ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభి వృద్ధి సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ మాజీద్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ హన్మంత్‌రెడ్డి, సర్పంచ్ తోట గణేష్, ఎంపీటీసీ సభ్యులు సిరిగిరి శ్రీనివాస్, పాల కేంద్రం అధ్యక్షుడు గాంధీ, పశువైద్య సిబ్బంది సరళారాణి, విజయ, స్వప్న, సత్యం, శ్యామల, విజయ లక్ష్మి, రైతులు ఉన్నారు.

‘రెవెన్యూ’ వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- ‘రహదారికీ రైతుబంధు’పై విస్తృత చర్చ
- ‘ఆంధ్రజ్యోతి’ కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ‘రహదారికీ రైతుబంధు’ శీర్షికన బుధవారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని ‘ఆంధ్రజ్యోతి’ బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. “ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్‌ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం” అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. “కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు” అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో‌స్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.


బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్‌ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?

- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):“కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?” అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): “రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?” అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ ‘న్యాయ్ యాత్ర’ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుకమ్మ పండుగే లేనట్లుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. “రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను” అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను

సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరపున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్లు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి



మూడు చక్రాల వాహనాలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్‌రూరల్, జనవరి 24: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకు వెళ్లాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన అర్హులైన ఆరుగురు దివ్యాంగులకు ట్రైటర్స్ వా హనాలు ఎమ్మెల్యే పంపిణీచేసి వాహనాలకు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో అందరితో సమానంగా దివ్యాంగులు సైతం జీవించాలని, వారి దినచర్యలో భాగంగా సులభంగా నడపగలిగే ఆటోమెటెడ్ స్పెషల్లీ డిజైన్డ్ వాహనాలు ప్రభుత్వం తయారుచేయించిందని తెలిపారు. ఈ వాహనాలను దివ్యాంగులు సులభంగా నడపవచ్చన్నారు.అర్హులైన దివ్యాంగులను గుర్తించి ముందుగా ఆరుగురికి ప్రభుత్వం మంజూరుచేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ త్వరలోనే ఇస్తుందన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి : ఏసీపీ



విద్యార్థులకు టై, బెల్టులను అందజేస్తున్న దృశ్యం

సాలూర, జనవరి 24: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నా రు. బోధన్ మండలంలోని పెంటాఖుర్దు ప్రభుత్వ పాఠశాలలో బుధ వారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర అభ్యాసం తోనే మంచి మార్కులు సాధిస్తారన్నారు.విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాస రాజు, ఎస్ఐ నాగ్‌నాథ్‌లతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలి



ముఖ్యకార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న మాజీఎమ్మెల్యే, కౌన్సిలర్‌లు

ఆర్మూర్‌రూరల్, జనవరి24: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికను వెంటనే నిర్వహించాలని కోరుతూ మాజీఎమ్మె ల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధ వారం మున్సిపల్ అడ్మిని స్ట్రేష న్ అర్బన్ డెవలప్‌మెంట్ అథా రిటీ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ కు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా సీడీఎంఏ డైరెక్టర్ దివ్యదేవరాజన్ కలిసి ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక వెంటనే నిర్వహించాలని వినతిపత్రం అందజే శారు. ఈనెల 4వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మాన=నం ప్రవేశపెట్టగా నెగ్గడంతో నూతన చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలని వారు కోరారు. అవిశ్వాస తీర్మానం నెగ్గి 20రోజులు కావస్తున్న నూతన చైర పర్సన్ ఎన్నిక నిర్వహించక పోవడంతో పరిపాలన అస్తవ్యస్తంగా తయా రైందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల ర్‌లు ఇట్టెడి నర్సారెడ్డి, లిక్కి శంకర్, రాస రాము, ఖాందేశ్ శ్రీనివాస్, అయ్యప్ప శ్రీనివాస్, సుంకరి రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 24: కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని వచ్చే నెలలో కొత్త ప్రభుత్వ ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కోఠారి కమిషన్ సిఫార్సుల మేరకు 30 శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాలన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, సమావేశాలకు ముందుగానే విద్యారంగంపై స్పష్టమైన నివేదికను తయారు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, మెస్‌చార్జీలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విఘ్నేష్, మహేష్, దీపిక, తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన నాయకులు

మాక్లూర్, జనవరి24: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీగా ఎన్నికైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహేష్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగా ధర్ గౌడ్, దయాకర్‌రావు, లచ్చరెడ్డి, ఆకుల సుభాష్, తదితరులు ఉన్నారు.

అవాస యోజన పాఠశాల సందర్శించిన డీఈవో

ఆర్మూర్‌రూరల్, జనవరి24: ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి, రాంపూర్ గ్రామాల శివారులో గల పనిప్రాంత ఆవాస యోజన పాఠశాలలను జిల్లా విద్యాధికారి దుర్గాప్ర సాద్, జీసీడీవో వనిత సందర్శించారు. ఇటుక బట్టి ప్రాంతంలో ఈ పాఠశాలలను గతంలో ఏర్పాటు చేసి అక్కడి విద్యార్థులకు చదువు నేర్పిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఉపయో గపడే టీషర్టులు, కొబ్బరినూనె, ఇతర మేకప్ సామాగ్రితో పాటు నిత్యవసర సరుకులను డీఈ దుర్గాప్రసాద్ సొంతంగా పిల్లలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, సీఆర్‌పీ సంతోష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్‌అర్బన్,జనవరి 24: కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆ యన నివాసంలో మర్యాధపూర్వకంగా కలిశారు.మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యేసుదర్శన్‌రెడ్డితో కలిసి గడుగు గంగాధర్ సీఎంను కలిశారు. సీఎంగా పదవీబాధ్యతలు స్వీకరించిన తర్వా త మొదటిసారి ఆయనను కలవడంతో శాలువ, బుకేతో సన్మానించారు.



సీఎంను కలిసిన గడుగు గంగాధర్

● షబ్బీర్‌అలీని కలిసిన భక్తవత్సలం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన మాజీ మంత్రి షబ్బీర్ అలీని నిజామాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, బాపూజీ వచనాలయ చైర్మన్ భక్తవత్సలం (డిల్లీ) బుధవారం హైదరాబాద్‌లో కలిసి ఘనంగా సన్మానించారు.నగరఎస్టీసెల్ అధ్యక్షుడు సుభాష్‌జాదవ్, 17వ డివిజన్ నాయకులు సాయిలు, మారుతి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు వైసాక్షి సంతోష్ షబ్బీర్ అలీని కలిసి అభినందించిన వారిలో ఉన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

కోటగిరి,జనవరి24: విద్యార్థులు మంచి పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని, ఎలాంటి ఇబ్బందులు వచ్చిన ధైర్యంగా ఎదుర్కొవాలని పొతంగల్ తహసీల్దార్ రమేష్ సూచించారు. పొతంగల్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలికలు బలమైన ఆహాకాన్ని తీసుకోవాలని సూచించారు. కష్టపడి చదువుకుంటే భవిష్యత్ బాగుంటుందన్నారు. రక్తహీనత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమాజంలో బాలికలు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్య ఎదురైనాధైర్యంతో ముందుకు సాగాలన్నారు. బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, డీసీసీబీ డైరెక్టర్ శాంతేశ్వర్ పటేల్, సర్పంచ్ వర్ని శంకర్, ఎంపీటీసీ వీరేశం, ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు మణి, సుమలత, మండల ఆరోగ్య విస్తీరణ అధికారి గోవర్ధన్, నాయకులు పవన్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో బుధవారం జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి రాణి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

మోస్రా: మండల కేంద్రంలోని చే నెంబర్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బేటీ బడావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు, తల్లులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఆయా లత తదితరులు పాల్గొన్నారు.

సాలూర: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల బాలికలకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాధిక అన్నారు. బుధ వారం బోధన్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికా హారం, రక్తహీనతపై అంగన్‌వాడీ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు ఆకుకూరలు, తాజా పండ్లు తినాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విక్టోరియా రాణి, రత్న, సరోజా, అర్చన, ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి తెలంగాణ గురుకుల రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బేటీ బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు పాటల పోటీలు, చిత్రలేఖనం, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో భార్గవి మాట్లాడుతూ పిల్లలు అన్నిరకాలుగా శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుదల సాధించిన తర్వాతనే వివాహం చేసుకోవాలని సూచించారు. పిల్లల యొక్క హక్కులు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. అనం తరం గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినిలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి,పుష్ప,పాఠశాల ప్రిన్సిపాల్‌నహీద ఫిర్దోస్,అంగన్‌వాడీ టీచర్లు సంగీత,జగదాంబ,రజనీ, శైలజ, లక్ష్మీలు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించినట్లు పాఠశాల ఎస్‌వో సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల కు ఎగ్జామ్ ప్యాడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రా నిర్వాహకులు, పాఠశాలలోని మహిళఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముప్కాల్: జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ముప్కాల్ కస్తూర్బగాంధీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలికలు సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజికంగా ఎదిగినప్పుడే దేశంపురోగతి సాధిస్తోందని అన్నారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రజ లలో అవగాహన పెంపొందించడానికి బాలిక శిశువు గురించి అసమానత్వం, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, విద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్యవివాహాల గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి వివరించారు. ఈ సందర్భంగా బాలికలకు వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు, పెయింటింగ్ పోటీలు నిర్వహించగా ప్రతిభ చూపిన విద్యార్థినిలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్‌లు, అమీన, జ్యోతి, వాణి, విద్యార్థిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని జెంటిల్‌కిడ్స్ పాఠశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండె ంట్ గుజరాతీ ప్రకాష్ మాట్లాడుతూ ఆడ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను రూపుమాపే విధంగా భారత ప్రభుత్వం నేషనల్ బాలికల డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో కార్యక్రమం రూపొందించిందని, అందులో భాగంగా 2008నుంచి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించనున్నామని తెలిపారు. బాలికలు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లత, అధ్యాపకులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఏర్గట్ల కేజీబీవీలో విద్యార్థినులకు ఎగ్జామ్ ప్యాడ్‌లను అందజేస్తున్న ఎస్‌వో సంధ్య



బాలికల పాఠశాలలో విద్యార్థినిలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో భార్గవి



విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం



మోకాన్‌పల్లి కేజీబీవీలో..

నగరంలో పర్యటించిన ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, జనవరి 24: నగరంలోని ఏడవ డివిజన్ రోటరీనగర్, సాయిప్రియనగర్, చంద్రనగర్‌లలో బుధవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త పర్యటించారు. నగర కమిషనర్ మకరంద్, ఇతర అధికారులతో కలిసి ఆయన డివిజన్‌లలో పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నట్లు, వర్షాకాలం రోడ్లు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. డివిజన్‌లలో ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలు సక్ర మంగా లేవని వాటిని త్వరలోనే బాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. డివిజన్‌కు విడుదలైన కోటి రూపాయలు శంకుస్థాపనలకే పరిమితమయ్యాయని ఎమ్మెల్యే అన్నారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు.

● షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నగరంలోని బోధన్ రోడ్‌లోగల ల్రిమా గార్డెన్‌లో బుధవారం మైనార్టీలకు షాదీముబారక్ చెక్కులను అర్బన్ ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పెళ్లి ఆడపిల్ల ఉన్న కుటుంబానికి బారం కాకూడదని ప్రభుత్వం షాదీముబారక్ పేరుతో ఆర్థిక సహాయం కింద లక్ష 116 రూపాయలు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. నగరంలో 158 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. బీజేపీ పార్టీ, కేంద్ర ప్రభుత్వం సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అనే లక్ష్యంతో పనిచేస్తోందని నగరంలోనూ మైనార్టీల అభివృద్ధి, సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, మాస్టర్ శంకర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



రోటరీనగర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నాణ్యమైన పసుపునే మార్కెట్‌కు తీసుకురావాలి

ఖిల్లా, జనవరి 24: పసుపు పండించిన రైతులు పసుపును బాగా ఉడకబెట్టి, ఎండబెట్టి నాణ్యమైన పసుపును మార్కెట్ యార్డుకు అమ్మకానికి తీసుకురావాలని మార్కెట్ కమిటీ సెలక్షన్‌గ్రేడ్ కార్యదర్శి వెంకటేశం తెలిపారు. జిల్లాలోని పలు గ్రామాలలో సిబ్బందితో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అందుకు ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేసి పసుపు పండించే రైతుల వద్దకు వెళ్లి వారికి నాణ్యమైన పసుపు తీసుకొని రావాలని సూచనలు చేశారు. నాణ్యమైన పసుపుకు మెరుగైన ధరను వచ్చేలా చూస్తామన్నారు.

నగరంలో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

ఖిల్లా, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన మాజీ మంత్రి షబ్బీర్ అలీ నియామకం పట్ల బుధవారం నగరంలో మాజీ కార్పొరేటర్, 32, 33 డివిజన్ ఇంచార్జి ముజాహిద్ ఖాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.హైదరాబాద్‌లోని షబ్బీర్‌అలీ నివాసంలో కలిసి ముజాహిద్ ఖాన్ పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్‌కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్‌డే వేడుకలు



ఆర్టీసీ డ్రైవర్లను సన్మానిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, జనవరి 24: డ్రైవర్స్‌డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని డిపో-1, 2లలో డ్రైవర్స్‌ను ఘనంగా నిర్వహించారు. నగరంలోని డిపో-2లో ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్‌లు హాజరై ఉత్తమ డ్రైవర్‌లను సన్మానించారు. డిపో-1లో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ చందర్ రాథోడ్ ముఖ్య అతిధిగా హాజరై ఉత్తమ డ్రైవర్లకు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను,సలహాలను సూచించారు.ఆర్టీసీ డ్రైవర్లు క్రమశిక్షణకు మారు పేరు అన్నారు. ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.నిజామాబాద్ డిపో-1 నుంచి గాంధి,రాజేందర్, సాయి లు, డిపో-2 నుంచి ఎన్.లక్ష్మణ్,ఖరీం,విశ్వనాథ్, మురళిలను ఉత్తమ డ్రైవర్లుగా గుర్తించి వారిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిపో-1 మేనేజర్ ఆనంద్, డిపో-2 మేనేజర్ సాయన్న, ఆర్టీసీ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

రుద్రూర్ పరిశోధన కేంద్రంలో చిరుత సంచారం

● అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన





సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు, మృతి చెందిన అడవిపంది కళేబరం

రుద్రూరు, జనవరి 24 : రుద్రూరు మండల కేంద్రంలోని ప్రాంతీయ చెరకు వరి పరిశోధన కేంద్రంలో చిరుత సంచరిస్తుందని, అందరూ అప్ర మత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారి చంద్రప్రకాష్, రుద్రూరు పరిశో ధన కేంద్రం అధిపతి బాలాజీనాయక్‌లు పేర్కొన్నారు. బుధవారం పరిశోధన కేంద్రంలోని షుగర్ కెన్ సెక్షన్‌లో చిరుత అడవి పందిపై దాడి చేసిందని పేర్కొన్నారు. అడవి పందిపై చిరుత దాడి చేయడంతో అడవి పంది మృత దేహం లభించిందన్నారు. ఘటన స్థలాన్ని అటవీ శాఖ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరకు పంటలో చిరుత సంచరిస్తుందని, అనవాళ్లు సైతం లభించాయని పేర్కొన్నారు. ఇది ప్రమాదకరమన్నారు. అనంతరం టీచింగ్, నాన్‌చింగ్, లేబర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని, చిరుత సంచార అనవాళ్ళు కనిపిస్తే వెంటనే సిబ్బంది అప్రమత్తమై సమాచారం అందించాలన్నారు. రుద్రూరు నుంచి అంబం వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో బోన్ ఏర్పాటు చేసి చిరుతను పట్టుకుంటామని అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు.

బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్ రూరల్, జనవరి 24 : బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ అన్నారు. బుధవారం సాలూర మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడ పిల్లల పట్ల వివక్షత చూపవద్దని అన్నారు. బాల్య వివాహాలపై, బాలికల హక్కుల చట్టాలపై అవగాహన కల్పించారు.బాలికల విద్య యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు.బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో జానకితో పాటు సర్పంచ్ చంద్రకళలతో పా టు ఉపాధ్యాయబృందం, విద్యార్థినులు ఉన్నారు.

నందిపేటలో గంజాయి పట్టివేత

నందిపేట, జనవరి24: మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో బుధవారం వాహనాల తనిఖీలో పోలీసులు 3.5కిలోల గంజాయిని పట్టుకున్నారు. రహస్య సమాచారం మేరకు ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ జి.రాహుల్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనం(హోండాషైన్)పై గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను పట్టుకున్నారు. వాహనాన్ని, గంజాయిని సీజ్ చేసి నిందిలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిని నిజామాబాద్ పట్టణం గౌతంనగర్ కాలనీకి చెందిన జిలకర ప్రసాద్, విద్యాసాగర్‌లుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాహుల్ హెగ్డే తెలిపారు. నందిపేట మండలంలో మత్తు పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసిన వాటిని వాడుతున్న వ్యక్తుల సమాచారం 8712659861 నెంబరుకు ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ రాహుల్ చెప్పారు.



నందిపేటలో వాహనాల తనిఖీలో గంజాయి స్మగ్లర్లను పట్టుకుంటున్న పోలీసులు

ఆటోనగర్‌లో చోరీ

బోధన్‌రూరల్, జనవరి24: బోధన్ పట్టణంలోని ఆటోనగర్‌లో తాళం ఉన్న ఇంటిని మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటితలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని ఇంటి యజమాని షేక్ షాదుల్లా పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.తమ కుటుంబ సభ్యులు మృతిచెందడంతో మహారాష్ట్రకు వెళ్లామన్నారు. మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టిలోనికి ప్రవేశించి బీరు వాతాళాలను సైతం పగులగొట్టి ఏడు తులాల బంగారం నగలతో పాటు వెండి, కొంత నగదును ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నామ న్నారు. చోరీ ఘటనపై అన్నికోణాల్లో విచారణ చేపడుతున్నామని పోలీ సులు తెలిపారు.

చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.135	రూ.205	రూ. 225
వెన్‌కాబ్(కిలో)	రూ.140	రూ.210	రూ. 230

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,100	రూ.59,100	రూ.750

సినిమా గైడ్ నిజామాబాద్



పీవీఆర్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : ఫైటర్ (హిందీ 3డీ) (8.40, 12.15, 3.50, 7.25, 11.00)
- స్క్రీన్-2 : హనుమాన్ (తెలుగు) (11.30, 3.20, 6.40, 10.00)
- స్క్రీన్-3 : గుంటూరుకారం (12.10, 6.50, 10.10)
  : హనుమాన్ (హిందీ) (3.30)
- స్క్రీన్-4 : హనుమాన్ (తెలుగు) (1.00)
  : సైంధవ్ (4.20)
  : నా సామిరంగ (7.20, 10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : హనుమాన్ (10.25, 1.30, 4.30, 7.40, 10.40)
- స్క్రీన్-2 : గుంటూరుకారం (1.20,7.30)
  : నా సామిరంగ (4.30, 10.35)
- స్క్రీన్-3 : ఫైటర్ (హిందీ 3డీ) (10.00, 1.00, 4.10, 7.20, 10.30)
  : హనుమాన్ (10.30, 1.30, 4.30, 7.35, 10.35)



- దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
- లలితమహల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
- నటరాజ్ : ఫైటర్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : సైంధవ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్